క్లుప్తంగా

సర్వే సిబ్బందికి సహకరించాలి

● ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటరు జాబితాను తాజాపరుచుటకు త్వరలో సర్వే సిబ్బంది ఇంటింటికి వస్తారని, అందరూ సహకరించాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ, తాజాపరచుట కార్యక్రమాలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతీబూత్ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులు ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను ఉండేలా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



జనగామ: బహుజన పోరాటయోధుడు ప్రజా యుద్ధనౌక గద్దర్ ద్వితీయ వర్ధంతిని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కళాకారులు తమ ఆటపాటలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టగళ్ల సంజీవ, బానోత్ గణేష్, జనగామ శంకర్, పన్నీరు కనకరాజు, కేమిడి కనకరాజు, బెజ్జారి చందు, రంజాన్, అంబాటి అంజన్న పాల్గొన్నారు.

‘గూడూరు తెలంగాణలో మరో చుండూరు’



పాలకుర్తి టౌన్: కుల దరహంకార హత్యలో అసువులు బాసిన గూడూరు మరో చుండూరు అని అసమానత నిర్మూలన పోరాట నిర్మూలన సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అన్నారు. గూడూరు గ్రామానికి చెందిన సుశ్రుత, దేవాన్ష్‌కు బుధవారం సమితి ఆధ్వర్యంలో చుండూరు దళిత అమరవీరుల దినోత్సవం సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడారు. గూడూరులో కులాంతార వివాహం చేసుకున్న దళితురాలు సుశ్రుత, దేవాన్ష్‌ను హత్య చేసి తెలంగాణలో మరో చుండూరుగా గూడూరును మార్చారని అన్నారు. సుశ్రుత తల్లి కంది కోమల, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవిందు, అంబేడ్కర్ సంఘం నాయకులు అశోక్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



అభిషేక్ (ఫైల్)

నర్మెట: వెల్దండకు చెందిన శివంగుల అభిషేక్ (18) మంగళవారం పురుగుల మందుతాగడంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇంటర్మీడియట్‌ను మధ్యలోనే ఆపివేసిన అభిషేక్ జులాయ్‌గా తిరగడంతో చదువు ఇష్టంలేక పోతే ఏదైనా పనినేర్చుకుని హైదరాబాద్‌లో ఉపాధి చూసుకోవాలని తల్లిదండ్రులు పలుమార్లు సూచించారు. దీంతో మనస్తాపానికి గురై తమ వ్యవసాయ బావివద్ద పురుగల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినాడు. తండ్రి కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

ఎట్టకేలకు వెలిగిన హైవే లైట్లు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారిపై ఎట్టకేలకు హైవే లైట్లు బుధవారం వెలిగించారు. గత నాలుగేళ్ల కిందట టోల్ రోడ్డు పరిధిలోకి వచ్చిన ఈ రహదారి దేవరుప్పుల, కామారెడ్డిగూడెంలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన లైట్లు ప్రారంభోత్సవానికి పరిమితమైంది విదితమే. ఎట్టకేలకు వైరింగ్ లోపాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టి లైట్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం బట్టి లైటింగ్(బల్బులు మార్చడం) కెపాసిటీ తగ్గిచంచడంతో కొంత వెలుగు తగ్గినట్టయింది.

పూర్వ ఉపాధ్యాయుల దాతృత్వం

దేవరుప్పుల: లక్ష్మణ్‌తండా గ్రామ పరిధి బీఆర్ తండా ప్రాథమిక పాఠశాలకు పూర్వ ఉపాధ్యాయులు గుడెల్లి రాజు, ఉపేందర్, భూక్య రామచంద్రు నాయక్, దాసరి విజయ్‌కుమార్‌ల దాతృత్వంతో రంగులు వేసి కొత్త కళను తేవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం టి.జ్యోతి మాట్లాడుతూ మన ఊరు-మన బడి పురోగతి కోసం అన్ని వర్గాల ప్రజల తోడ్పాటు అందించాలన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

● పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చారి ఆస్పత్రి సమీపాన రామాలయం వీధిలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు వెంట పలు వాహనాలు అనునిత్యం వెళ్తుండగా విద్యుత్‌పోల్‌తో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు సరిగ్గా మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో కనీసం ఆటో వెళ్లలేని దుస్థితి నెలకొంది. సదరు విద్యుత్ పోల్ నుంచి పలు గృహాలకు విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లోనూ సిమెంట్ పోల్‌లు వేస్తుండగా డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో రోడ్డు మధ్యలో ఇనుపపోల్ ఉండటం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పోల్ వద్దకు వెళ్లాలంటే కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇనుప విద్యుత్ స్తంభాన్ని మార్చాలని, రోడ్డుకు ఒక పక్కగా వేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్యగౌడ్

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికుల ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్ర లక్ష్మీనారాయణగౌడ్, కుర్ర రాజుగౌడ్ అధ్వర్యంలో జరిగిన మండల సభలో ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో మన హక్కులను సాధించుకుందామన్నారు. జిల్లాకు పాపన్న పేరు నామకరణ చేయాలని, ఖిలాషాపూర్ రోడ్డుపై పాపన్న కళాతోరణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, బాల్నె రాజయ్య, బండమీది వెంకన్న, రంగు మురళి, రంగు శేఖర్, గడ్డం కుమార్, బాల్నె రాజయ్య, బండమీది ఐలయ్య, కొడిదేటి శంకర్, ముప్పిడి వీరస్వామి, శాగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటమల్లయ్యగౌడ్

దర్దేపల్లిలో బోనాల ఉత్సవాలు



బోనమెత్తుకున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి గ్రామంలో దండెమ్మ, పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులు బోనాలను తీసుకు వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. కాగా, ఉత్సవాల్లో మాజీ మంత్రి దయాకర్‌రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లి బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముదిరాజ్ కులస్థులు వారి ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహిళలు, కులపెద్దలు డప్పుచప్పుళ్ళ మధ్య బోనాలతో సామూహికంగా పెద్దమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు.

రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

జఫర్‌గఢ్: పది సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉప్పుగల్లు రిజర్వాయర్ కాల్వ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి పాలకుర్తి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కెనాల్ కాల్వను సంఘం నాయకులు, రైతులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుగల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన ప్రధాన కాల్వల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్న పూర్తి కావడం లేదన్నారు. నక్క యాకయ్య, వడ్లకొండ రాజు, అన్నెపు ప్రభాకర్, పులిగిల్ల నాగరాజు, పెద్ద రాములు, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కెనాల్ సందర్శనలో సంఘం నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని మేరా యువ భారత్ వలంటీర్ నవీన్‌యాదవ్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మేరాయువభారత్ వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, అధ్యాపకులు గంగారెడ్డి, అశోక్, రమేష్, శ్రీధర్‌రెడ్డి, ధనుంజయ, రాజు, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

సాక్షి నెట్‌వర్క్: తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ అధికారులు, వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి తల్లిపాలపై అవగాహన కల్పించారు.



చిల్పూరు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మానస

సంక్షిప్త సమాచారం

రక్త నిధి ఏర్పాటుకు రక్తదానం చేయాలి

జనగామ: అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు జిల్లా ఆస్పత్రిలో రక్త నిధి ఏర్పాటుకు ప్రతీఒక్కరు ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణికుమార్, సలహాదారుడు వంగ భీమరాజు అన్నారు. ఏరియా ఆస్పత్రిలో అత్యవసర ఆపరేషన్ నిమిత్తం ఓ మహిళకు రక్తం అవసరమైన నేపథ్యంలో అమ్మ ఫౌండేషన్ సూచన మేరకు స్పందించిన వడ్డేపల్లి సాయి, పోచంపల్లి శివలు రెండు యూనిట్ల రక్తాన్ని బుధవారం దానం చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి కొయ్యడ రవి, అప్పు, బింగి నర్సింహులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

చిల్పూరు: డ్రగ్స్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. శ్రీపతిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల నివారణలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

గ్రామ దేవతలకు నూతన వస్త్రాల అందజేత

చిల్పూరు: పోచమ్మ బోనాలను పురస్కరించుకుని బుధవారం పల్లగుట్ట గ్రామంలోని బొడ్రాయి, పోచమ్మలకు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు-కిరణ్మయి దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. అందులో భాగంగా ఉదయం వారి ఇంటి నుంచి డప్పుచప్పుళ్ల మధ్య అర్చకులు బ్రహ్మచారి, కేశోజు నిరంజనాచారి, ముక్కెర అశోక్, యాకయ్య, కుమ్మరి వీరస్వామిలు మొదట బొడ్రాయి, అనంతరం పోచమ్మకు నూతన వస్త్రాలను అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా గ్రామ దేవతలకు వస్త్రాలను అందజేయడంతో పాటు లైటింగ్ ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు.

పిల్లలకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి

కొడకండ్ల: పుట్టిన బిడ్డ నుంచి నిర్దేశించిన వయస్సులో పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్లు హరికృష్ణ, భారతి సూచించారు. బుధవారం ఏడునూతుల, రామవరం సబ్‌సెంటర్‌లను వారు సందర్శించి వ్యాక్సినేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. ఎఎన్ఎంలు శోభ, ఎలీషా, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

చిల్పూరు: పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులు ఇటీవల నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల పూర్వ హెచ్ఎం కేతిడి నర్సింహారెడ్డి విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. హెచ్ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు

జనగామ రూరల్: చీటకోడూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని బ్రిడ్జి సాధన సమితి నాయకుడు యాసారపు కరుణాకర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షకు పవన్ కల్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ సంఘం బుధవారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జోగు భాస్కర్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంపత్‌కుమార్, యాకన్న, గౌస్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌పై ఆరోపణలు తగవు’

దేవరుప్పుల: నిలువ నీడ లేని నిరుపేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ఇసుక తరలింపు విషయంలో కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఆరోపణలు తగవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల సురేష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా ఇసుక దోపిడీకి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ఆరోపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్మారెడ్డి, పాండు కృష్ణ, నాగరాజు, గణేష్, పారుపెల్లి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

దేవరుప్పుల: భూభారతి భూసమస్యల దరఖాస్తుల పరిష్కారం కోసం సంబంధిత రికార్డులు పరిశీలిస్తున్నట్టు తహసీల్దార్ ఆడెపు ఆండాళ్ పేర్కొన్నారు. బుధవారం మండల తహసీల్‌లో ఇటీవల ఊరూరా నిర్వహించిన భూభారతి సదస్సులో మండలంలోని దరఖాస్తులకు సంబంధించి భూ రికార్డుల వాస్తవిక వివరాల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతం

జనగామ: పట్టణంలోని బీరప్పగడ్డ ఏరియా సరస్వతీ శిశుమందిర్‌లో ఈ నెల 8వ తేదీ (శుక్రవారం)న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు ఎ.బాలనర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఆర్డీఓ వెంకన్న తదితరులు



జనగామ: జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దిశ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు



జనగామ:11వ వార్డులో.. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి తదితరులు

జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో, కూడళ్లలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పులలో.. ఎంపీడీఓ సురేష్‌కుమార్



జఫర్‌గఢ్: జూనియర్ కళాశాలలో..

ఉపాధి పనులను సక్రమంగా చేపట్టాలి

● అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఫీల్డు అసిస్టెంట్స్ సక్రమంగా చేయించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటివారైనా శాఖపరంగా చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మండల పరిధిలో జరిగిన ఈజీఎస్ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులను గత నెల 23 నుంచి ఈనెల 5వ తేదీవరకు ఎస్ఆర్‌పీ పర్యవేక్షణలో వీఆర్‌పీలు, డీఆర్‌పీలు పరిశీలించి ఆయా గ్రామాల్లో ప్రజావేదిక గ్రామసభలను నిర్వహించారు. కాగా, బుధవారం చేపట్టిన మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికలో ముఖ్య అతిథిగా అడిషనల్ డీఆర్‌డీఓ హాజరుకాగా డీఆర్‌పీలు గ్రామాల వారిగా చేసిన పనులపై ఆడిట్ నిర్వహించారు. అనంతరం అడిషనల్ డీఆర్‌డీఓ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ అసిస్టెంట్ మేనేజర్ సంధ్యారాణి, ఎంపీడీఓ విజయశ్రీ, సోషల్ ఆడిట్ స్టేట్ టీం మేనేజర్ అంజగౌడ్, ఎస్ఆర్‌పీ నర్సయ్య, పీఆర్ ఏఈ రామక్రిష్ణ, ఏపీఓ ప్రేమయ్య, ఈసీ కిరణ్‌కుమార్, అదనపు క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ రాజవర్ధన్‌రెడ్డి, టీఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వ బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య సూచించారు. బుధవారం మండలంలోని నిడిగొండ గ్రామంలో జనగామ సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం పాల్గొని మాట్లాడుతూ పీఎం సురక్ష బీమా యోజనలో 18 సంవత్సరాల నుంచి 70 ఏళ్లలోపు వారు ప్రతీ సంవత్సరం రూ.20, 18 నుంచి 50 ఏళ్ల ఉన్న వారు సంవత్సరానికి రూ.436 బ్యాంకు ఖాతా ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏపీవై సుకన్య సమృద్ధి యోజన, ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఎస్‌బీఐ జిల్లా ఎల్‌డీఎం మూర్తి, ఇన్‌చార్జ్ ఏపీఎం ఎల్లస్వామి, సీసీ భాగ్యలక్ష్మి, సీఎఫ్ఎల్ అనిల్, నవీన్, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య

‘కడియం’ను విమర్శించే హక్కు రాజయ్యకు లేదు

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి అభివృద్ధిని విస్మరించాడన్నారు. గతంలో రాజయ్య చేసిన అభివృద్ధి.. ఎమ్మెల్యే కడియం చేసిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, గొరిగ రవి, కొయ్యడ ప్రభాకర్, నామాల బుచ్చయ్య, ఎండి బాషుమియా తదితరులు పాల్గొన్నారు.

‘అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోరు’

లింగాలఘణపురం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు ఊరుకోరని తరిమికొడుతారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకుడు దిలీప్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేవస్థాన చైర్మన్ మూర్తి, నాయకులు సదానందం, మార్కెట్ డైరెక్టర్లు శ్రీలతారెడ్డి, మోహన్, నాయకులు అనిల్, శ్రీనివాసురెడ్డి, విజయ్‌భాస్కర్, గణపతి, నాగేందర్ ఉన్నారు.



లింగాలఘణపురం: మాట్లాడుతున్న నాయకులు

శ్రావణ మాస పూజలు

జనగామ: శ్రావణమాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాస్తు గణపతి దేవాలయంలో గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి నైవేద్యంగా సమర్పించిన తీర్థప్రసాదాలను భక్తులకి వితరణ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం

● మాజీ మంత్రి దయాకర్‌రావు



పాలకుర్తి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ మాటలకు తెలంగాణ ప్రజలు మోసపోయారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. అనంతరం మంచుప్పుల మాజీ సర్పంచ్ బొమ్మగాని కొంరయ్య, వల్మిడి మాజీ ఎంపీటీసీ తాళ్ల సోమనారాయణ, బొమ్మగాని సమ్మయ్య, కోతులబాధ పీఏసీఎస్ డైరెక్టర్ ఏనుగు అంజిరెడ్డి, ముడావత్ భాష, సంతోష్, భుక్యా లక్కు, బానోత్ బాలజీతో పాటు 50 మంది దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అక్రమ కేసుల కొట్టివేత

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చేపట్టిన పోరాటంలో ఎమ్మార్పీఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను జిల్లా కోర్టు కొట్టి వేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పైస రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు న్యాయవాది మహేందర్ రావు, జిల్లా కోర్టుకు ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. లాయర్లు చరణ్, రవి, నాయకులు జెరిపోతుల సుధాకర్ మాదిగ, రవి మాదిగ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రక్షాబంధన్ సోదర భావాన్ని పెంపొందిస్తుంది

జనగామ: రక్షాబంధన్ మనలోని సోదర భావాన్ని పెంపొందిస్తుందని వివేకానంద సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్ అన్నారు. వివేకానంద సేవా సమితి, మాతృదర్శన్ ట్రస్ట్ చంపక్ హిల్స్ ఆధ్వర్యంలో న్యూ క్రియేషన్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి చంద్రశేఖర్, హెచ్ఎం కిరణ్మయి, వనపర్తి శేఖర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

చిల్పూరు: పంట పొలాల్లో సమగ్ర సస్యరక్షణ పాటించాలని అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్‌శంకర్ అన్నారు. మల్కాపూర్ గ్రామంలోని రైతువేదికలో బుధవారం కేంద్రి య సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వరిలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం బసవన్నప్ప పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సమగ్ర సస్యరక్షణ గురించి వివరించడంతో పాటు లింగాకర్షణ బుట్టల ఉపయోగంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి నజీర్, ఏఈఓలు నర్సింహులు, జయశ్రీ, వినయ్‌కుమార్, రైతులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, పశుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

కొడకండ్ల: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం నాయకులు బొమ్మగాని విక్రం గౌడ్, మసురం రవీందర్, దేశగాని నాగరాజులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల గణన చేపట్టి జనాభా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపితే అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తుందని, రిజర్వేషన్లు అమలయ్యే దాకా పోరాడుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, ఎన్నం శ్రీనివాస్, మసురం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జనగామ రూరల్: బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులు పాల్గొన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, నాయకులు జక్కుల వేణుమాధవ్, అలేటి సిద్దిరాములు, రాజబోయిన లక్ష్మీనారాయణ, దాసరి శ్రీకాంత్, తోట సత్యం తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ బస్టాండ్ సమీపాన మహమ్మద్ ఇంతియాజ్ అనే వ్యక్తి గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానిక పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. సీఐ జి.వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంతియాజ్ 10వ తరగతి వరకు చదువుకుని ఆటో డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం గొర్రెలు, మేకలు కాస్తున్నాడు. కాగా, మద్యానికి అలవాటుపడిన ఇంతియాజ్‌కు సింహాచలంకు చెందిన వెగిస ఉజ్వల్‌సాయికుమార్‌రాజు అలియాస్ నానితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో కొత్తపల్లిలోని బ్రిడ్జి వద్ద రెండు వారాల క్రితం అతని నుంచి రూ.10వేలకు 430 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి ఇంట్లో ఉంచుకుంటాడు. కాగా, బుధవారం గంజాయిని పేపర్‌లో చుట్టి సంచిలో పెట్టుకుని ఎవరికైనా విక్రయించేందుకు స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌కు వచ్చాడు. అప్పుడే స్థానిక ఎస్సై రమేష్ పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్‌కు రాగా పోలీస్ వాహనం చూసి ఇంతియాజ్ సంచిని పడేసి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా సంచిలో గంజాయి ఉన్నట్లు చెప్పాడు. పంచుల సమక్షంలో సంచిని పరిశీలించగా అందులో రూ.21,500 విలువైన 430 గ్రాముల గంజాయి ఉన్నట్లు గమనించారు. వెంటనే అతడికి అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా తెలిపిన వివరాల ప్రకారం ఇంతియాజ్‌పై, అతడికి గంజాయి విక్రయించిన సింహాచలంకు చెందిన ఉజ్వల్‌సాయికుమార్ రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.